
# నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
## నారాయణపేట

10 | మహబూబ్‌నగర్, గురువారం 8 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET


# తుంగభద్రకు గర్భశోకం

**నదిని తోడేస్తున్న సీమ మాఫియా**

- రాత్రయితే యథేచ్ఛగా జేసీబీలతో తవ్వకాలు
- వందల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలింపు
- అధికారుల కనుసన్నల్లో జోరుగా దందా
- ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న జనం
- సిరులు కురిపిస్తున్న సింగవరం ఇసుక



సింగవరం వద్ద ఇసుక తోడడంతో నదిలో ఏర్పడినగుంతలు (ఫైల్)



సింగవరం శివారులో నదిలో రాత్రి సమయంలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక(ఫైల్)



అలంపూర్, మే 7 : తుంగభద్ర నదిలో ఇసుక దొంగలు పడ్డారు. రాత్రి, పగల తేడా లేకుండా జోరుగా ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నదని నదీ పరీవాహక గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ మండలం సింగవరం శివారులో తుంగభద్ర నది ఇసుక మాఫియాకు సిరులు కురిపిస్తున్నది. వేసవిలో నదిలో నీరు తగ్గుముఖం పట్టడంతో ఇసుక అక్రమ రవాణా జోరందుకున్నది. ఏపీకి చెందిన మాఫియా జేసీబీలను తీసుకొచ్చి ఇసుకను తోడేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక సీమ ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. అక్కడ డంపులు చేసి అవసరం మేరకు యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా 'మూడు పువ్వులు-ఆరు కాయలు'గా వ్యాపారాన్ని కొనసాగిస్తూ జేబులు నింపుకొంటున్నారు.

**భయం నీడలో సింగవరం వాసులు**

నది నుంచి ఇసుక తరలింపు భారీగా జరుగుతుంటే అడ్డుకోవాలంటే సింగవరం వాసులు జంకుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లతో తరలిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీంతో 'మూడు జేసీబీలు-ఆరు ట్రాక్టర్లు' అన్న చందంగా దందా జోరందుకున్నది. స్థానికంగా ఉండే రైతులు, గ్రామస్తులు ఇసుక తరలింపు సమాచారాన్ని అధికారులకు చేరవేసినా ఫలితం లేదని పలువురు వాపోతున్నారు. ఆయా శాఖల్లో పని చేసే సిబ్బంది మాఫియాతో ఉన్న లింకుల కారణంగా అధికారులు దాడులకు వస్తుంటే ముందస్తు సమాచారం చేరవేస్తున్నారని ఆరోపించారు. అధికారులు పేరుకు మాత్రమే దాడులు చేస్తున్నారు కానీ.. మాఫియాను పట్టుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీమ మాఫియా అక్రమాలను చూసి కొందరు యువత ఇసుక తరలింపునకు సంబంధించిన పోస్టులను సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. అయినా సంబంధిత శాఖాధికారుల్లో చీమకుట్టినట్లు కూడా స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీమ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మన సహజ సంపద తరలిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఈ విషయమై స్థానిక ఎస్సై వెంకటస్వామిని వివరణ కోరగా.. గతంలో ఇసుక తరలింపు జరిగింది.. ప్రస్తుతం అటువంటిదేమీ లేదని కొట్టిపాశారు. ఇసుక తరలకుండా దాడులు ముమ్మరం చేశామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఫొటోలు పాతవని తోసిపుచ్చారు.

### కేసీఆర్ పాలనలో ఇసుక రేణువు కూడా తరలలేదు

మన వద్ద ఇసుక కొరత తీవ్రంగా ఉన్నది. ఇంటి నిర్మాణాల కోసం ఇసుక కొనుగోలు చేసేందుకు నానా పాట్లు పడుతుంటే ఏపీలో మాత్రం ఇసుక ఫుల్‌గా లభిస్తున్నది. తుంగభద్ర నదిలో ఎప్పుడు పడితే అప్పుడు దర్జాగా తవ్వకాలు చేపడుతుండడంతో పుష్కలంగా లభిస్తున్నది. నదీతీర ప్రాంతాల ప్రజలు సొంత అవసరాల కోసం ఎడ్లబండ్లపైన ఇసుకను తరలిస్తుంటే.. పోలీసులు అడ్డుకుంటూ కేసులు పెడుతున్నారు. అయితే ఇసుక తవ్వకాలతో నదిలో జలాలు ఇంకిపోతున్నాయి.. సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోరు, బావులు ఎండిపోతూ పొలాలకు నీరందని పరిస్థితి. పెట్టిన పెట్టుబడులు ఎల్లక.. సాగునీరు లేక రైతులు గోస పడుతున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో సీమ మాఫియా నదిలోకి దిగాలంటే జంకేది. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో యథేచ్ఛగా తరలింపు కొనసాగుతున్నది. అధికార పార్టీ ఉన్నత స్థాయిలో ఉండే బడా నేతలు.. స్థానిక అధికారులతో సంప్రదింపులు జరిపి ఎవరి స్థాయిలో వారు అమ్యామ్యాలు సెట్ చేసుకొని మాఫియాతో చేతులు కలిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి

## ఉగ్రవాదులను కూకటివేళ్లతో పెకిలించేయాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తి టౌన్, మే 7 : ఉగ్రవాద సంస్థలను కూకటివేళ్లతో సహా పెకిలించివేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తీవ్రవాద స్థావరాలపై భారత్ దాడికి మూకుమ్మడిగా మద్దతు పలకాలన్నారు. అమాయకులను కాల్చిచంపిన ఉగ్రమూకలపై భారత సైన్యం చేపట్టిన చర్యలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. దేశం మొత్తం సైనికుల వెంటే ఉందని, పార్టీలకతీతంగా అండగా నిలవాలన్నారు. భారతీయుల ఐక్యత చాటాల్సిన సందర్భం ఇదని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాద మూకల నిర్మూలన విజయవంతం కావాలని కోరారు.



## ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం

ఉప్పునుంతల, మే 7 : అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకున్న ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేసి పాకిస్తాన్‌కు భారత్ తగిన బుద్ధి చెప్పిందని ఆర్మీ మాజీ హవల్దార్ రవీందర్‌రావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. భారత్‌పై పాకిస్తాన్ ఎన్నోసార్లు కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ భారత్ ఏమాత్రం తొందరపడి చర్యలు తీసుకోలేదన్నారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొన్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో ఏమాత్రం తగ్గొద్దన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరిట 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు దాడి చేసి ధ్వంసం చేయడం గర్వకారణమన్నారు. సైనికులకు దేశ ప్రజలందరూ అండగా నిలిచి వారిలో ఆత్మస్థైర్యం నింపాలన్నారు. ఒక వేళ యుద్ధంలో పాల్గొనడానికి తనకు అవకాశం వస్తే తప్పనిసరిగా పాల్గొంటానని తెలిపారు.



ఆర్మీ మాజీ హవల్దార్ రవీందర్‌రావు (ఫైల్)

## యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి



అయ్యవారిపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, మే 7 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, అందుకు కృషి చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు మండలం అయ్యవారిపల్లిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ యువత వ్యసనాల బారినపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చెప్పారు.

**కార్యకర్త కుటుంబానికి పరామర్శ..**

బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నిరంజన్‌రెడ్డి అన్నారు. కొత్తసూగూరులో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ముంత సునీత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆమెకు పార్టీ సభ్యత్వం ఉండడంతో భర్త రాజుకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. నియోజకవర్గంలో పార్టీని నమ్ముకున్న వాళ్లకు ఏ ఆపదొచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మండల అధ్యక్షుడు రాములు, జగన్నాథం, నాయకులు కర్రెస్వామి, వెంకటేశ్, రాజశేఖర్, దిలీప్‌రెడ్డి, సాయినాథ్, రమేశ్, వీరస్వామి, రాము, మజీద్, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి ఉపాధి కూలీ మృతి



కొత్తకోట మండలం నాటవెల్లిలో మహిళా కూలీ పడిన బావిని పరిశీలిస్తున్న ఎస్సై, గ్రామస్తులు

కొత్తకోట, మే 7 : బావిలో కాలు జారిపడి ఉపాధిహామీ కూలి మృతిచెందిన ఘటన కొత్తకోట మండలంలోని నాటవెల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. ఉపాధి హామీ అధికారులు, పోలీసుల కథనం ప్రకారం.. నాటవెల్లికి చెందిన బోయ పద్మ(45) గ్రామ శివారులో ఉపాధి హామీ పనులకు బుధవారం వెళ్లింది. మృతురాలికి దాహమేసి నీళ్లు తాగడానికి పక్కనే ఉన్న బావి వద్దకు వెళ్లింది. బావిలోకి దిగుతుండగా కాలుజారి అందులో పడిపోయింది. పద్మ ఎంతకీ తిరిగిరాకపోవడంతో అక్కడే పనిచేస్తున్న కూలీలు బావి వద్దకు వెళ్లి చూడగా, నీటిపై తేలియాడుతూ కనిపించింది. బావి నుంచి బయటకు తీసి చూడగా, అప్పటికే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బావిలో జారిపడి మృతి చెందిన బోయ పద్మ

# మరమ్మతులు మరింత ఆలస్యం



ర్యాలంపాడ్ రిజర్వాయర్‌లో నీటిని తక్కువగా నింపిన దృశ్యం

- ర్యాలంపాడు రిజర్వాయర్‌ను మరోసారి పరిశీలించాలన్న పుణె కమిటీ
- నీటి లీకేజీలతో 4టీఎంసీలకు 2టీఎంసీలే నిల్వ
- రైతుల్లో సన్నగిల్లుతున్న ఆశలు

గద్వాల, మే 7 : ర్యాలంపాడ్ రిజర్వాయర్ మరమ్మతు పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని తోడి పంటలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన నెట్టెంపాడ్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడ్ రిజర్వాయర్ చేపట్టారు. రిజర్వాయర్‌కు ఏర్పడ్డ లీకేజీల కారణంగా పూర్తి స్థాయిలో నీటిని నింపుకోలేని పరిస్థితి నెలకొన్నది. జూరాలకు వరదలు వచ్చిన సమయంలో పంపింగ్ ద్వారా రిజర్వాయర్‌ను నింపుతారు. ప్రస్తుతం మరమ్మతులు మరింత ఆలస్యం అవుతుండడంతో ఈ ఏడాది వానకాలంలో కూడా నీటిని పూర్తి స్థాయిలో నింపుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఏప్రిల్ 10వ తేదీన ధరూర్, గట్టు మండలంలోని ర్యాలంపాడ్, ముచ్చోనిపల్లి రిజర్వాయర్లను పూణేకు చెందిన సెంటర్ వాటర్ పవర్ రీసెర్చ్ బృందం రిజర్వాయర్ లీకేజీలు ఎలా అవుతున్నాయి, ఎలా అరికట్టవచ్చనే అంశంపై సంజయ్‌బూరెల్, సునీల్‌పిళ్లై, నర్సయ్య, డాక్టర్ మందిర, డాక్టర్ తనుశ్రీ తదితరుల బృందం ర్యాలంపాడ్, ముచ్చోనిపల్లి రిజర్వాయర్లను పరిశీలించింది. నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకపోగా, ప్రస్తుతం మరోసారి పరిశీలించాలని చెప్పడంతో మరమ్మతులు ఆలస్యమయ్యే అవకాశం ఏర్పడింది. ర్యాలంపాడ్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 4టీఎంసీలు కాగా, ప్రస్తుతం లీకేజీల కారణంగా రెండు టీఎంసీల నీటిని కూడా నిల్వ చేసుకోలేని పరిస్థితి నెలకొన్నది.

**ర్యాలంపాడ్ రిజర్వాయర్ నుంచి లీకేజీలు..**

ర్యాలంపాడ్ రిజర్వాయర్ కరకట్టనుంచే నీళ్లు లీకేజీ అవుతున్నాయని 2019లో అధికారులు గుర్తించారు. అయినప్పటికీ మరమ్మతుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సీపేజీ పెరిగి కరకట్ట ఉనికికే ప్రమాదం ఏర్పడింది. నీటి లీకేజీల తీవ్రత పెరగడంతో 2021లో రిటైర్డ్ ఇంజినీర్ల బృందం రిజర్వాయర్‌ను పరిశీలించింది. రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపితే కట్టకు ప్రమాదమని సామర్థ్యాన్ని 4టీఎంసీల నుంచి 2టీఎంసీలకు తగ్గించారు. అప్పటి నుంచి 2టీఎంసీల నీటినే నింపుతున్నారు. కేటీదొడ్డి మండలానికి ఈ నీరే ప్రధానం కావడంతో ఆ మండలం చివరి ఆయకట్టుకు నీరు అందకపోవడంతో ఈ ఏడాది సాగుచేసిన పంటలు పూర్తి స్థాయిలో ఎండిపోయి రైతులు నష్టపోయారు. దీంతో మరమ్మతులు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ర్యాలంపాడ్ రిజర్వాయర్ మరమ్మతులపై మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లికృష్ణారావుతోపాటు ఇరిగేషన్ నిపుణుల బృందం పరిశీలించింది. వీరి పరిశీలన అనంతరం ఇరిగేషన్ సీఈతో పాటు లీకేజీలపై నిపుణల బృందం పరిశీలించాలని కేంద్రానికి లేఖ రాశారు.

**మరోసారి రిజర్వాయర్ పరిశీలన..**

ఏప్రిల్ 10వ తేదీన ఐదుగురు సభ్యులతో కూడిన సెంటర్ వాటర్ పవర్ రీసెర్చ్ కమిటీ వారు రిజర్వాయర్‌ను సందర్శించి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సాయిల్ కండిషన్, నైసర్గిక పరిస్థితులు, రాక్ మెకానిక్స్, సాయిల్ స్టెబిలిటీ, ఎమర్జెన్సీయాక్షన్‌ప్లాన్ తదితర 5అంశాలపై విచారణ చేశారు. దీనిపై విచారణ చేయాల్సి ఉందని బృందం స్పష్టం చేసింది. దీంతోపాటు సీపేజీని ఎలా అరికట్టవచ్చనే అంశాన్ని పరిశీలించారు. రిజర్వాయర్‌ను పరిశీలించిన పుణె బృందం కట్ట ఎత్తు పెంచడంతోపాటు వెడల్పు చేయాలని సూచించారు. రివిట్‌మెంట్ పైభాగంలో కొత్త టెక్నాలజీ ఉపయోగించి గ్రౌండింగ్ చేయాలని సూచించారు. ఇందుకు రూ.144 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. బడ్జెట్‌లో రిజర్వాయర్ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అయితే గతంలో పరిశీలించిన కమిటీ వివరాల నివేదిక ప్రభుత్వానికి ఇవ్వకపోగా, మరింత లోతుగా పరిశీలించాలని, పూర్తి నివేదిక ఇవ్వాలంటే కనీసం 15రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.1.80లక్షలు ఖర్చవుతుందని ప్రభుత్వంతోపాటు ఇరిగేషన్ అధికారులకు ఎస్టిమేషన్ చెప్పడంతో పుణె కమిటీ ప్రతిపాదనపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోక పోవడంతో రిజర్వాయర్ కట్ట మరమ్మత్తుల పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రిజర్వాయర్ లీకేజీల మరమ్మతుకు పుణె కమిటీతో పరిష్కారం దొరుకుతుందని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. వారు మరింత లోతుగా స్టడీ చేయాలని చెప్పడంతో మరమ్మతులు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది.



ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న పుణె బృందం(ఫైల్)

## కాంట్రాక్టర్ల కోసమా.. కమీషన్ల కోసమా ?



వనపర్తి పట్టణంలో జనావాసాలు లేనిచోట నిర్మించిన సీసీ రోడ్డు

వనపర్తి టౌన్, మే 7 : జిల్లా కేంద్రంలోని 31 వార్డులో రోడ్డు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. జనావాసాలు లేనిచోట సీసీరోడ్లు వేయడంపై ప్రజలు మండిపతున్నారు. గతంలో అనేక ప్రతిపాదనలు, వినతులు ఇచ్చిన పట్టించుకోని మున్సిపల్ అధికారులు ఇండ్ల మధ్య కాకుండా జనావాసాలు లేని చోట నిర్మాణాలు ఎవరి కోసం చేస్తున్నారని, కేవలం కాంట్రాక్టర్లు.. కమీషన్ల కోసమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు.



కొండ్రోనిపల్లి రైస్ మిల్లు దగ్గర క్యూ కట్టిన ట్రాక్టర్లు

## మిల్లుకు పోటెత్తిన ట్రాక్టర్లు

ధన్వాడ, మే 7 : మండలంలోని కొండ్రోనిపల్లి రైస్‌మిల్లుకు రైతులు బుధవారం 70 ట్రాక్టర్లు, లారీలు, డీసీఎంల్లో రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు క్యూ కట్టారు. మిల్లుకు వచ్చి మూడు రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల రగడ

- తప్పెట్లమొర్సులో అధికారులపై దూషణలు
- మాకెందుకు మంజూరు కాలేదని నిలదీత

గట్టు, మే 7 : మండలంలోని తప్పెట్లమొర్సులో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు బుధవారం రగడ చోటుచేసుకున్న ది. ఎంపీవో రవికుమార్, పీఎస్ తిమ్మప్ప ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించడానికి గ్రామానికి వెళ్లారు. కాంగ్రెస్‌లోని ఓ వర్గానికి చెందిన లబ్ధిదారులకు 18, అదే పార్టీలోని మరో వర్గానికి 15 ఇండ్లు మంజూరయ్యాయని చెబుతున్నారు. ఈ క్రమంలో మొదటి జాబితాకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించడానికి ఎంపీవో, ప్రత్యేకాధికారి గ్రామ పంచాయతీ వద్దకు వెళ్లారు. ఈ సమయంలో మరో వర్గంలోని వారితోపాటు గ్రామస్తులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అన్ని అర్హతలు ఉన్నా తమకెందుకు ఇండ్లు మంజూరు కాలేదంటూ అధికారులపై ఆక్రోశం వెళ్లగక్కి అధికారులను నిలదీశారు. అర్హులకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంజూరయ్యాయని లబ్ధిదారులు అధికారులతో గొడవకు దిగారు. ఓ దశ లో ప్రత్యేకాధికారి బైక్‌ను తోసే ప్రయత్నం చేశారు. పరిస్థితి చేయిదాటి పోతోందని గ్రహించిన ఎంపీవో, ప్రత్యేకాధికారి అక్కడి నుంచి ఎంపీపీ కార్యాలయానికి వెళ్లారు.

## ఉల్లి ధరలు తగ్గుముఖం

దేవరకద్ర, మే 7 : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి. 147క్వింటళ్ల ఉల్లి విక్రయానికి కాగా, మార్కెట్ అధికారులు వ్యాపారస్తులతో కలిసి టెండర్లు నిర్వహించగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.1,450, కనిష్ఠంగా రూ.1,200 ధర పలికింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 50కిలోలు తూకం వేసి విక్రయించారు.

## ట్రాక్టర్‌ను తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

మల్దకల్, మే 7 : మండలంలోని విఠలాపురానికి చెందిన రైతు ఆనంద్‌కు చెందిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంగళవారం పొలంలో దుక్కి దున్ని సాయంత్రం అక్కడే షెడ్డు వద్ద ట్రాక్టర్‌ను ఉంచాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు నిప్పు పెట్టగా పూర్తిగా కాలిపోయినట్లు వాపోయాడు. ట్రాక్టర్ విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



విఠలాపురంలో గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన ట్రాక్టర్